## మనసంతా ఇక్కడే..

* అటా వేడుకల్లో ప్రవాసాంధ్రులు

* అన్నింటా తెలుగు సువాసనలే

న్యూస్‌టుడే, నెల్లూరు

కన్నతల్లి రుణం తీర్చుకోడానికి ఖండాంతరాల్లో స్థిరపడిన తెలుగు ముద్దుబిడ్డలు తరలివచ్చారు. తరతరాల సంప్రదాయాన్ని, సంస్కృతిని, కళలను విదేశీగడ్డపై కాకుండా పుట్టిపెరిగిన పల్లెలో మనసారా ఆస్వాదించాలన్న తపనతో వచ్చిన వీరికి సింహపురి ఘనస్వాగతం పలికింది. గతంలో ఎన్నడూలేని విధంగా వినూత్నంగా అమెరికా తెలుగు సంఘం (అటా) వేడుకలను తొలిసారిగా నెల్లూరులో శనివారం నుంచి నిర్వహిస్తున్నారు. ప్రతి రెండేళ్లకోసారి అమెరికాలో జరిపే ఈ వేడుకలకు ఈసారి నెల్లూరు వేదికగా నిలిచింది.

కాంక్రీట్ జంగిల్‌లో క్షణం తీరిక లేని జీవితాలను గడిపే ప్రవాసాంధ్రులను కాసింత సేదతీర్చి.. ఆహ్లాదపరిచేందుకు కనులకింపైన ఆకుపచ్చని పంటలు, కయ్యానికి కాలుదువ్వే ఒంగోలు గిత్తలు, కనుమరుగవుతున్న ప్రాచీన జానపద కళలు నెల్లూరు అటా ఉత్సవాలకు తరలివచ్చాయి. తమను తాము పరిచయం చేసుకుని వారి స్మృతిపథంలో చెరగని ముద్ర వేశాయి. అదే సమయంలో జిల్లా అభివృద్ధిలో ప్రవాసాంధ్రులను భాగస్వాముల్ని చేసేందుకు జిల్లాయంత్రాంగం, నాయకులు ఈ వేడుకలను వేదికగా చేసుకున్నారు. శనివారం మధ్యాహ్నం అయిదు గంటల ప్రాంతంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో అడుగడుగునా తెలుగు సంస్కృతి తొణికిసలాడింది. ఓవైపు పండరి భజనలు, కోలాటాలు, గిరిజన నృత్యాలు .. మరోవైపు పురమందిరంలో పద్మజారెడ్డి భరతనాట్య ప్రదర్శన. అన్నింటా తెలుగు సువాసనలే. ఏ ప్రవాసాంధ్రుడిని కదిపినా ఒకటేమాట 'ఎక్కడ ఉన్నా మా మనసంతా పుట్టిపెరిగిన పల్లెపైనే'. సభలో మాట్లాడిన పలువురు ప్రవాసాంధ్రులు కన్నతల్లిలాంటి కన్న రు రుణాన్ని తీర్చుకోడానికి మా శాయశక్తులా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఎన్నో సంవత్సరాలుగా అమెరికాలో ఈ వేడుకలను జరుపుకొంటున్నా ఇంతటి అనుభూతిని ఆస్వాదించలేదని వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

### కొత్త సంప్రదాయానికి నాందీ పలికిన సింహపురి

రెండేళ్లకోసారి అమెరికాలో జరిపే అటా వేడుకలను తొలిసారి సొంత రాష్ట్రంలో నిర్వహించుకునేలా ప్రవాసాంధ్రులను ప్రోత్సహించి, వారిని ఒప్పించి మెప్పించిన ఘనత నెల్లూరీయులదే. సింహపురిని నాందీగా చేసుకుని 26, 27 తేదీల్లో అటా అధ్యక్షుడు గవ్వ చంద్రారెడ్డి సొంత రైన నల్గొండ జిల్లా సూర్యాపేటలో, 29, 30వతేదీల్లో హైదరాబాద్‌లో ఇదే తరహా ఉత్సవాలను నిర్వహించనున్నారు.

## ఉట్టిపడిన తెలుగుదనం

* ఆకట్టుకున్న స్టాల్స్

నెల్లూరుసిటీ, డిసెంబరు 22 (న్యూస్‌టుడే): అటా వేడుకల్లో భాగంగా నగరంలోని వి.ఆర్. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రవాసాంధ్రులను కట్టిపారేశాయి. పాత కాలపు తెలుగు సాంప్రదాయాలను కళ్లకు కట్టి

నట్లు స్టాల్స్ ఏర్పాటు చేశారు. టెంకాయలతో తయారు చేసిన వివిధ రకాల బొమ్మలు, కొయ్యతో రూపొందించిన గృహోపకరణాలు, అట్టలతో చేసిన గృహాలంకరణలు వారిని ఆశ్చర్యపరిచాయి. ప్రాచీన తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా వరిపొలాలు, కాగితాల బొమ్మలు, కల్లుగీత, చేనేత మగ్గాలు వారిని పులకింపచేశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో వంద మందికిపైగా యువతులు పాల్గొన్నారు. వివిధ జిల్లాలకు చెందిన ప్రవాసాంధ్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులతో వారు స్టాల్స్‌ను సందర్శించి ఆనందం వ్యక్తం చేశారు. మంత్రి రామనారాయణరెడ్డి స్టాల్స్ రూపొందించిన వాటి గురించి, జిల్లా ప్రాముఖ్యతను వివరించారు.

## మీ రాక ఆనందదాయకం

* ప్రవాసాంధ్రులపై మంత్రుల ప్రశంసలజల్లు

నెల్లూరు సిటీ, డిసెంబరు 22 (న్యూస్‌టుడే): ప్రవాసాంధ్రులు జన్మభూమిపై చూపుతున్న మమకారం ప్రశంసనీయం. వారి రాకతో నెల్లూరు సీమ పులకరించిందని కేంద్ర, రాష్ట్ర మంత్రులు పనబాక లక్ష్మి, ఆనంరామనారాయణరెడ్డిలు కొనియాడారు. నెల్లూరులో రెండు రోజులపాటు జరిగే 'ఆటా' వేడుకలను శనివారం సాయంత్రం మంత్రులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా పనబాక లక్ష్మి మాట్లాడుతూ ఆటా వేడుకలను నెల్లూరులో నిర్వహించి నెల్లూరీయులకు ఆనందాన్ని పంచిన ప్రవాసాంధ్రులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. వారు విదేశాల్లో స్థిరపడినప్పటికీ పుట్టి పెరిగిన గ్రామ సీమను మరువకుండా అభివృద్ధి చేసేందుకు ముందుకురావడం ప్రశంసనీయమన్నారు. రాష్ట్రంలో పల్లెలు ప్రగతిబాట పట్టడంలో కొంత వెనుకబడ్డాయని, వీటిని అభివృద్ధిపథంలో పయనింప చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నప్పటికీ ప్రవాసాంధ్రులు ముందుకొస్తే మరింత త్వరగా గ్రామాలు సర్వతోముఖాభివృద్ధి సాధిస్తాయన్నారు.

### నెల్లూరులో మినీ రవీంద్రభారతి

సాహితీ, సాంస్కృతిక ప్రియులైన నెల్లూరీయులకు మరింత ఆనందాన్ని పంచేందుకు నెల్లూరులో ఓ మినీ రవీంద్రభారతిని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి రామనారాయణరెడ్డి సభాముఖంగా ప్రకటించారు. స్థానిక నృత్య పాఠశాలకు కళాశాల స్థాయిని కల్పించనున్నట్లు తెలిపారు. తెలుగువారు ఎక్కడున్నా అందరం ఒక్కటే అన్న భావనను కలిగించేందుకే ఇక్కడ ఆటా వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు ప్రవాసాంధ్రులు ముందుకొస్తున్నారని, వారికి తమవంతు సహకారం అందించి కలిసికట్టుగా పల్లెసీమలను అభివృద్ధిపథాన పట్టిస్తామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములయ్యే ప్రవాసాంధ్రులకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు.

### జన్మభూమిని మరవకండి

ఎక్కడికెళ్లినా కన్నతల్లి.. జన్మభూమిని మాత్రం మరవొద్దని భాజపా నాయకులు ఎం.వెంకయ్యనాయుడు ప్రవాసాంధ్రులకు సూచించారు. ఈ మార్గాన్ని ప్రతి ఒక్క ప్రవాసాంధ్రుడు అనుసరిస్తే ప్రపంచలోనే భారతదేశం అగ్రగామిగా నిలుస్తుందన్నారు.

### గ్రామాలపై దృష్టి

'అటా' అధ్యక్షుడు గవ్వా చంద్రారెడ్డి మాట్లాడుతూ పుట్టి పెరిగిన గ్రామాలను మరవకుండా వాటిని అభివృద్ధి పరిచేందుకు ప్రవాసాంధ్రులు సంకల్పదీక్ష తీసుకున్నట్లు ప్రకటించారు. ముఖ్యంగా గ్రామాలపైనే దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. వచ్చే ఏడాది న్యూజెర్సీలో అటా వేడుకలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అటా వేడుకల సంధానకర్త రవి సన్నారెడ్డి మాట్లాడుతూ జిల్లాకు చెందిన చాలామంది అమెరికాలో ఉన్నా మాతృభూమిలోనే స్థిరపడేందుకు మక్కువ చూపుతున్నారని, అదే నిజమైన మాతృప్రేమన్నారు. ప్రవాసాంధ్రులంతా సమష్టిగా జిల్లాకు తమ వంతు సేవలందించాలని కోరారు. ప్రవాసాంధ్రుడు జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుభాషను పరిరక్షించడం మనందరి బాధ్యతని పేర్కొన్నారు. కలెక్టర్ ఎం.రవిచంద్ర, జెడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డిలు ప్రవాసాంధ్రుల సేవలను కొనియాడారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమానికి నెల్లూరు ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి అధ్యక్షత వహించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, డీసీసీబీ ఛైర్మన్ వాకాటి నారాయణరెడ్డి, నెల్లూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఛైర్మన్ ఎం.గోపాలకృష్ణయ్య చౌదరి, అటా కో ఆర్డినేటర్ వి.ఎన్.రెడ్డి, దామోదర్‌రెడ్డి, రాజు చింతల తదితరులు పాల్గొన్నారు.

## సొంత ఇంటి అనుభూతి

### * తెలుగువారి అభివృద్ధికి సాయం

నెల్లూరు, డిసెంబరు 22(న్యూస్‌టుడే): తెలుగు సాంప్రదాయాన్ని, సంస్కృతిని కాపాడాలి. భావితరాలకు వాటిని అందివ్వాలి. తెలుగుభాష అభివృద్ధికి కృషి చేయాలి. ఇదీ నెల్లూరుకు తరలివచ్చిన ప్రవాసాంధ్రుల మనోగతం. జన్మభూమిలో పాతరోజులు గుర్తుకు వచ్చేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఓ మరిచిపోలేమని వారు కొనియాడారు.

### ఇదో మధురానుభూతి

* వీరారెడ్డి, ఐ.టి. కంపెనీ కన్సల్టెంట్, అమెరికా

నెల్లూరుకు రావడం ఇదే మొదటిసారి. సొంత రు వరంగల్ జిల్లా జనగామ. నెల్లూరులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాలు ఓ మధురానుభూతిగా మాలో నిలచిపోయాయి. స్వర్ణభారత్ ట్రస్టు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు చూసి ఆశ్చర్యపోయా. ఇందుకు నా వంతు సహకారం అందిస్తా.

### అప్పటికీ.. ఇప్పటికీ చాలా తేడా

* ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, ఐ.టి. కంపెనీ సి.ఇ.ఒ., అమెరికా

మాది నల్గొండ జిల్లా సూర్యాపేట. గతంలో ఓసారి నెల్లూరు వచ్చా. అప్పుడు నేను చూసిన నెల్లూరుకు ఇప్పటికీ చాలా తేడా ఉంది. అన్ని విధాలా ఎంతో అభివృద్ధి చెందింది. తెలుగు సంప్రదాయాలు, సంస్కృతి భావి

తరాలకు అందించేలా ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడుతాయి. అమెరికా నుంచి రాగానే సొంత ఇంటికి వచ్చా మనే అనుభూతి కలిగింది.

## ఎప్పుడో చిన్నప్పుడు చూశా

* లోకేష్‌రెడ్డి, కేట్స్ ఆర్గనైజింగ్ ఫౌండర్, అమెరికా

నెల్లూరులో నిర్వహించిన వివిధ కళారూపాలు నేను చిన్న వయసులో ఉన్నప్పుడు చూశా. మరలా ఇన్నేళ్లకు చూసే భాగ్యం కలిగింది. ప్రాచీన కళలను పోషించాలి. అందుకు ప్రతిఒక్కరి సాయం అవసరం. మొద ట్నుంచి సిటీ కల్చర్‌కు అలవాటు పడ్డాం. ఇక్కడ చూస్తున్న గ్రామీణ నేపథ్యం నాలో పాతరోజులు గుర్తు చేస్తోంది.

## సంతోషాన్ని నింపింది

* జితేందర్‌రెడ్డి, అధ్యక్షుడు, 'ఆటా'

ఆటాలో ఏర్పాటు చేసిన ప్రాచీన కళా ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారుల్లో ఉత్సాహం నాలో సంతోషాన్ని నింపింది. ఇది ఓ తియ్యని మధురానుభూతి. మా పూర్వీకులు నెల్లూరీయులే. తెలుగు గొప్పదనాన్ని పరిరక్షిం చడంలో 'ఈనాడు' లాంటి పత్రికలు చేస్తున్న కృషి అభినందనీయం. అమెరికాలో కూడా తెలుగు పాఠశాలలు ఉన్నాయి. ఉగాది, సంక్రాంతి వంటి అన్ని పండుగలను అక్కడి తెలుగువారందరం కలిసి జరుపుకొంటాం.

**Courtesy Eenadu.**